# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గూగుల్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలను తీసుకువచ్చి విశాఖపట్టణాన్ని టెక్ హబ్ గా మారుస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- ❖ కాకినాడ జిల్లాలో పర్యటించిన కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

- ❖ విశాఖపట్టణంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని.. ప్రజలెవరు అపోహలు నమ్మవద్దని కలెక్టర్ ఎం. అభిషిక్త కిశోర్ కోరారు.

- ❖ రాబోయే రెండు రోజుల పాటు రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

====================

గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా సెంటర్ సహా వివిధ ఐటీ సంస్థలను తీసుకువచ్చి విశాఖపట్టణాన్ని టెక్ హబ్ గా మారుస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈరోజు జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంత్రి నారా లోకేశ్.. చంద్రబాబు నాయుడు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ సమర్థవంతమైన పాలనతో అనేక పనులు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో నీటి భద్రత కోసం సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసి, రైతులకు నీరందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ను మళ్లీ లాభాల బాట పట్టేలా చేయగలిగామని.. పోలవరం, అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేశామని చంద్రబాబు నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ మధ్యాన్నం చెన్నై నుండి రాజమండ్రి విమానాశ్రయానికి వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో కాకినాడ చేరుకొని నగరంలో ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం.. ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించారు. ఆ తరువాత కాకినాడ నుండి విశాఖ నగరానికి బయలుదేరారు.

====================

ఏలూరు జిల్లాలోని పెదపాడు మండలం కలపర్రు ఓల్డ్ టోల్ ప్లాజాలో 3 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో ఆటో టెక్ సర్వీసెస్ వాహన ఫిట్నెస్ కేంద్రం, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ATS) ను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహన ప్రమాదాలు జరగకుండా ప్రజలకు సురక్షితమైన ప్రయాణాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పారదర్శకమైన సేవలు అందించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తుందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏపీఎస్ఆర్టీసీ రవాణా శాఖలో వినూత్నమైన మార్పులతో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్‌ను ఖచ్చితంగా పరీక్షించే సౌకర్యాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని, ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తమ వాహనాల భద్రతను నిర్ధారించుకోవాలని మంత్రి సూచించారు.

====================

విశాఖపట్టణంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే ప్రచారం పూర్తిగా అసత్యమని, ప్రజలు అపోహలకు లోనవద్దని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ స్పష్టం చేశారు. రేసపువానిపాలెం పరిధిలోని రామాటాకీస్ సమీపంలో ఉన్న హెచ్.పి. పెట్రోల్ బంకును ఆయన ఈరోజు తనిఖీ చేశారు. సివిల్ సప్లైస్, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో  మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మొత్తం 123 పెట్రోల్ బంకులు పని చేస్తుండగా, ఎక్కడా ఇంధన కొరత లేదని పేర్కొన్నారు. గత వారం రోజులుగా రాష్ట్రమంతటా డ్రై అవుట్ ఘటనలు చాలా తక్కువగా ఉన్నప్పటికీ, ఒకటి రెండు బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ లేక పోవడం వల్ల కొరత ఉందనే అపోహలు వ్యాపించాయని గుర్తు చేశారు. తప్పుడు ప్రచారాల కారణంగా సాధారణ స్థాయి కంటే అధికంగా ఇంధన విక్రయాలు జరుగుతున్నాయని, దీంతో కొన్ని బంకుల వద్ద క్యూలు కనిపిస్తున్నాయని కలెక్టర్ వివరించారు.

====================

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో ఎంబీఏ, ఎంసీయే కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఐసెట్ పరీక్ష మే రెండవ తేదీ శనివారం జరగనుంది. ఈ పరీక్ష కోసం 26 వేల 300 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని ఏపీ ఐసెట్ కన్వీనర్ ఎం. శశి ఈరోజు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT) విధానంలో జరగనుందని, శనివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల 30 నిమిషాల వరకు రెండు సెషన్లలో జరగనుందని కన్వీనర్ తెలిపారు.

విరామం

====================

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని, రాబోయే రెండు రోజులు కూడా ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాల వర్షాల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో ఈరోజు అత్యధికంగా 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. మొత్తం 28 జిల్లాలకుగాను 16 జిల్లాల పరిధిలోని 88 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, బొండపల్లి, రామభద్రాపురం మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లా గరుగుబిల్లి, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు.

====================

రోగాల ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యతనిస్తూనే వ్యక్తుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు సమగ్ర వైద్య పరీక్షలు చేపట్టేందుకు వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 104 సంచార వైద్య వాహనాల (MMUs) ద్వారా ఏడాదికి 162.72 కోట్ల రూపాయల వ్యయంతో ముందుగా గుర్తించిన వ్యక్తులకు 47 రకాల వైద్య పరీక్షలు చేపట్టే పథకానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఆమోదం తెలిపారు. వ్యాధులకు గురైన వారికి చికిత్స అందిస్తున్న ప్రస్తుత విధానానికి భిన్నంగా... పౌరుల ప్రస్తుత సమగ్ర ఆరోగ్య పరిస్థితిని వివిధ పరీక్షల ద్వారా మదింపు చేసి తద్వారా రోగాలను నివారించే దిశగా తగు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సందర్భాల్లో వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఈ మేరకు విస్తృత చర్చల అనంతరం 104 వాహనాల ద్వారా అమలుకానున్న పౌరుల ఆరోగ్య తనిఖీ (సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్) పథకానికి మంత్రి ఆమోదం తెలిపారు.

====================

బీసీ కమిషన్ ఉత్తరాంధ్ర జిల్లాల్లో రేపటి నుంచి పర్యటించనుంది. వెనుకబడిన తరగతుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, వర్గాల వారీ అభ్యర్థనలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి కమిషన్ సభ్యులు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ... వివిధ కుల సంఘాలు, పౌర సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించనున్నారు. షెడ్యూల్ ప్రకారం 30న విశాఖపట్నంలో కమిషన్ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు.. బీసీ వర్గాలకు చెందిన సంఘాల నుంచి వినతులు స్వీకరించనున్నారు. అనంతరం నిపుణులతో ప్రత్యేక చర్చలు జరపనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఇక మే 1న శ్రీకాకుళం జిల్లాలోనూ, మే 2న విజయనగరం జిల్లాలో బీసీ కమిషన్ పర్యటించి వివిధ సమావేశాలు నిర్వహించనుంది.

====================

రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం, ఆరోగ్య శాఖ సమన్వయంతో సరికొత్త అత్యవసర చికిత్స పథకాన్ని అమలు చేస్తోందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్ లో "పీఎం రహత్ పథకం- రోడ్డు ప్రమాదం బాధితులకు అభయ హస్తం" గోడ పత్రికను ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ, వైద్య అధికారులతో కలిసి ఈరోజు ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను కలెక్టర్ వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 112 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

====================
====================